# సాగు కోసం సాహసం

- కర్రల సాయంతో వాగు దాటి వెళ్లి వ్యవసాయం చేస్తున్న రైతులు
- వంతెన ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి





కర్రల వంతెనపై పెద్దవాగు దాటుతున్న రైతులు, వ్యవసాయ కూలీలు

బయ్యారం, ఆగస్టు 24: సాగు చేయాలంటే ఆ ఊరి రైతులు సాహసం చేయక తప్పదు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని కాచనపల్లి-కొత్తగూడెం గ్రామాల మధ్య పెద్దవాగు ఉంది. వాగు అవతల కొత్తగూడెం పంచాయతీ పరిధిలో కాచనపల్లికి చెందిన సుమారు 30మంది రైతులవి 50 నుంచి 80 ఎకరాల వరకు సాగు భూములున్నాయి. ఏటా వానకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో దాటే పరిస్థితి ఉండదు. వాగుపై ఎలాంటి వంతెన లేకపోవడంతో పంటలు సాగు చేయాలంటే గ్రామస్తులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని సాహసం చేసి వాగు దాటాల్సి వస్తుంది. రైతులు బొంగులతో వంతెన ఏర్పాటు చేసి తాడు సహాయంతో ప్రమాదకరంగా దాటుతుంటారు. వ్యవసాయం కోసం కావాల్సిన పిండిబస్తాలు, ఎరువులు సైతం ఈ కర్రల వంతెన మీద నుంచే తీసుకెళ్తారు. గతేడాది వాగు దాటే క్రమంలో రైతు వెల్లంకి శ్రీనివాస్ వాగులో పడి మృతిచెందాడు. సాగు సీజన్ కావడంతో రైతులు, రైతు కూలీలు ఇబ్బంది పడుతూ వాగు దాటుతున్నారు. అంతేకాకుండా కాచనపల్లి, కిష్టాపురం, మొట్లగూడెం గ్రామాల ప్రజలు వాగు దాటి మూడు కిలోమీటర్లు ప్రయాణిస్తే కొత్తగూడెం గ్రామానికి చేరుకుంటారు. వాగుపై వంతెన లేకపోవడంతో చుట్టూ 20 కిలోమీటర్లు తిరిగి కొత్తగూడెం వెళ్లాల్సి ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి వంతెన ఏర్పాటు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

# కొత్తగూడ ఏజెన్సీలో అరుదైన ఉడుత



అటవీ ప్రాంతంలో కనిపించిన అరుదైన ఉడుత

కొత్తగూడ, ఆగస్టు 24 : మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఏజెన్సీలోని పాకాల అభయారణ్యంలో అరుదైన ఉడుత కనిపించింది. స్థానిక గుంజేడు ముసలమ్మ ఆలయానికి వచ్చిన భక్తులకు ఓ చెట్టుపై పాకుతూ ఇది కనిపించగా వారు ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయింది. తొలుత దాని ఫొటోను చూసిన వారు పునుగు పిల్లి అని భావించినప్పటికీ అది ఉడుతల్లో అరుదైన జాతి అని ఎఫ్ఆర్వో వజాయిద్ తెలిపారు. కాగా ముదురు ఎరుపు, నలుపు రంగులు కలగలిపి ఉన్న ఉడుతను ఇండియన్ జెయింట్ స్క్విరెల్ అని కూడా పిలుస్తారని తెలుస్తున్నది.



వరంగల్ నగర మాస్టర్‌ప్లాన్‌పై సమీక్ష నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

# వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయాలి

- ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- హైదరాబాద్‌లో కుడా అధికారులతో సమావేశం

వరంగల్, ఆగస్టు 24 : వరంగల్‌ను మహా నగరంగా తీర్చిదిద్దడానికి మాస్టర్‌ప్లాన్‌ను తక్షణమే సిద్ధం చేయాలని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, పలు శాఖల అధికారులతో వరంగల్ నగరాభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ తర్వాత రెండో పెద్ద నగరమైన వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు వెంటనే మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. 2041 మాస్టర్ ప్లాన్‌ను 2050 నాటికి పెరుగనున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధికి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ఇందుకు కావాల్సిన భూసేకరణ చేపట్టాలన్నారు. కన్సల్టెంట్లు తయారు చేసిన వరంగల్ మాస్టర్‌ప్లాన్‌ను మంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వీక్షించి పలు సూచనలు చేశారు. సమావేశంలో మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్, సీడీఎంఏ వీపీ గౌతమ్, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి హరిచందన, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే, పీవో అజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

# మళ్లీ ఇన్‌చార్జీలకే బాధ్యతలు

- తలలు పట్టుకుంటున్న వైద్యాధికారులు
- పూర్తిస్థాయి అధికారుల నియామకం కోసం ఎదురుచూపులు
- ముందుకు సాగని పరిపాలనా అంశాలు

వరంగల్‌చౌరస్తా, ఆగస్టు 24: ఇన్‌చార్జీల పాలనతో ఇబ్బందులు ఎదురవుతున్నా మళ్లీ వారికే బాధ్యతలు అప్పగిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ వాణి ఉత్తర్వులు జారీ చేయడంపై వైద్యాధికారులు పెదవి విరుస్తున్నారు. కాకతీయ మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, ఎంజీఎం హాస్పిటల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ బాధ్యతలను మార్చుతూ శనివారం డీఎంఈ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కేఎంసీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి స్థానంలో డాక్టర్ వీ మురళీకృష్ణకు, ఎంజీఎం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ చిలుక మురళి స్థానంలో డాక్టర్ జీ స్వర్ణకుమారికి ఇన్‌చార్జి బాధ్యతలు మార్చారు. ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాజా భరత్‌కుమార్, సీకేఎం హాస్పిటల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ షర్మిలను యథావిధిగా కొనసాగించారు. అయితే, డాక్టర్ రాజా భరత్‌కుమార్ మినహా మిగిలిన ముగ్గురు వైద్యులు ఇటీవల హైదరాబాద్ నుంచి బదిలీపై వచ్చారు. వీరికి స్థానిక అంశాలపై అవగాహన లేకపోవడంతో సుముఖంగా లేనట్లు సమాచారం. ఇన్‌చార్జిల పాలన వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నా ఉన్నతాధికారులు పూర్తిస్థాయి నియామకాలు చేపట్టకపోవడంతో వైద్యాధికారులు తలలు పట్టుకుంటున్నారు. పూర్తిస్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించి రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# వరదను లెక్కచేయక విధులకు..

**వాగులు దాటి సబ్ సెంటర్‌కు ఆశ కార్యకర్త జ్యోతిరాణి**



వాగు దాటుతున్న ఆశ కార్యకర్త

కన్నాయిగూడెం, ఆగస్టు 24 : విధి నిర్వహణ కోసం వరదను సైతం లెక్కచేయలేదామె. రెండు వాగులు దాటి సుమారు మూడు కిలోమీటర్లు నడిచి సబ్‌సెంటర్‌కు చేరుకుంది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం సర్వాయి సబ్ సెంటర్‌లో ఎనిమిది మంది ఆశ కార్యకర్తలు పనిచేస్తున్నారు. ప్రతి రోజు ఒకరు తప్పకుండా అక్కడ డ్యూటీలో ఉండాలి. శనివారం జ్యోతిరాణి అనే ఆశ కార్యకర్త సింగారం నుంచి బస్సులో వెళ్లి కొత్తూరు స్టేజ్‌లో దిగి రెండు వాగులను దాటి సర్వాయి చేరుకుంది. శనివారం తెల్లవారుజామున వర్షం కురవడంతో వాగులో వరద ఎక్కువ ఉన్నప్పటికీ డ్యూటీ చేయాలనే పట్టుదలతో ముందుకువెళ్లడాన్ని పలువురు అభినందించారు.

## పచ్చని కుంట.. అంతా వ్యర్థమేనంట!





చుట్టూ కొండలు, పచ్చని మొక్కలతో నీళ్ల నడుమ ఉన్న 'బతుకమ్మ తల్లి' ప్రతిమ.. చూసేందుకు ఎంత ఆహ్లాదంగా ఉందో అనుకుంటున్నారా?. కానే కాదు. అక్కడ కనిపించే పచ్చదనం వెనుక కుంటంతా నాదే అన్నట్టు ఆక్రమించేసిన గుర్రపు డెక్క, వ్యర్థాలు, దుర్గంధమే ఉన్నాయి. హనుమకొండ పద్మాక్షి గుట్టకు ఆనుకొని ఉన్న కుంట పక్కనే జీడబ్ల్యూఎంసీ చెత్త కుండీ ఏర్పాటుచేసినా సమీప కాలనీవాసులు అందులో వ్యర్థాలు ఇష్టానుసారం వేయడం, కుక్కలు ఆహారం కోసం వాటిని బయటికి లాగడంతో అవి కుంటలో పడి కలుషితమవుతున్నది. కుంట నుంచి గుర్రపుడెక్కను తొలగించి అక్కడ ఉన్న డస్ట్ బిన్ మరో చోటుకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్, ఆగస్టు 24

## నీళ్లు ఫుల్ / కాల్వల్లో నిల్

**బొమ్మకూర్ రిజర్వాయర్ నుంచి విడుదల కాని జలాలు**

**సాగుకు నీళ్లు లేక జనగామ రైతుల ఇబ్బందులు**




గోదావరి జలాలతో కళకళలాడుతున్న జనగామ మండలంలోని బొమ్మకూర్ రిజర్వాయర్



ఎండిపోయిన జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్- మరిగడి గ్రామాలకు నీళ్లను తీసుకెళ్లే కాల్వ

అసలే కరువు ప్రాంతం.. నీళ్లు లేక అనేక తిప్పలు పడ్డ ఈ ప్రాంతానికి గత కేసీఆర్ సర్కారు గోదావరి జలాలను తీసుకొచ్చి సస్యశ్యామలం చేసింది. కాల్వల ద్వారా గ్రామాల్లోని చెరువులు, కుంటలను నింపింది. గతంలో ఎక్కడచూసినా కోనసీమను తలపించిన ఈ ప్రాంతం నేడు బీడువారిన పొలాలతో దర్శనమిస్తున్నది. ఈ ప్రాంతంలోని బొమ్మకూర్ రిజర్వాయర్‌లో నిండుగా గోదావరి జలాలున్నా జనగామ మండలంలోని గ్రామాలకు నీరు విడుదల చేయకపోవడంతో రైతుల సాగు పనులు ముందుకు సాగడం లేదు. నీళ్లు లేక పొలాలు దున్నడం లేదు. నీరు అందినా అతికొద్ది మంది రైతులు మాత్రమే నాట్లు వేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం గోదావరి జలాలను కాల్వల ద్వారా గ్రామాల్లోని చెరువులకు విడుదల చేస్తే పొలాలు దున్నుకొని నాట్లు వేసుకుంటామని రైతులు వేడుకుంటున్నారు. రిజర్వాయర్‌లో పుష్కలంగా నీళ్లు ఉన్నా ఎందుకు విడుదల చేస్తలేరో అర్థం కావడం లేదని వాపోతున్నారు.

– జనగామ రూరల్, ఆగస్టు 24



రైతు ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

# డెడ్‌లైన్ 30

## రుణమాఫీ చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం

- సిగ్గూ శరం ఉంటే రేవంత్‌రెడ్డి దేవుళ్లకు, రైతులకు క్షమాపణ చెప్పాలె
- ఒట్లు పెట్టుకొని దేవుళ్లనే మోసం చేసిన సీఎం
- 40శాతం రైతులకు కూడా మాఫీ కాలే
- కాపులకనపర్తి రైతు ధర్నాలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సంగెం, ఆగస్టు 24 : ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి ఈ నెల 30 వరకు రుణమాఫీ పూర్తిగా చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు. వరంగల్ జిల్లా సంగెం మండలం కాపులకనపర్తిలో శనివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా నిర్వహించారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో కలిసి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నాటకమాడుతున్నదని. దేవుళ్ల మీద ఒట్టుపెట్టి, ప్రమాణం చేసి మాయమాటలతో అధికారంలోకి వచ్చిందన్నారు. శాసనసభ, పార్లమెంటు ఎన్నికల ముందు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్లు పెట్టుకున్నాడని, ఇప్పుడు మాఫీ చేయకుండా రైతులను మోసం చేసిండని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆగస్టు 15 వరకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి, 40శాతం మందికి కూడా చేయలేదని విమర్శించారు. పొరపాటు చేశామని మంత్రులు కూడా ఒప్పుకున్నారని అన్నారు. రైతులను బాగు చేసిన మాజీ సీఎం కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి సిగ్గులేకుండా ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడని, సీఎం హుందాగా వ్యవహరించాలన్నారు. ఇష్టమొచ్చినట్టు మాట్లాడి ఇజ్జత్ తీసుకుంటున్నాడని అన్నారు. కాళేశ్వరం, దేవాదుల నీళ్లు లేవని, 24 గంటల కరెంటు ఇస్తలేరని, ఇలాంటి ప్రభుత్వానికి ఎందుకు ఓట్లేశామని ప్రజలు తలలు పట్టుకుంటున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేయకపోతే రైతులతో కలిసి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎర్రబెల్లి హెచ్చరించారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ పరకాల నియోజకవర్గంలో గాల్లో గెలిచిన ఎమ్మెల్యేకు ఏ ఊరు ఎక్కడుందో ఇప్పటివరకు తెలియదని, ఆయన రైతుల గురించి ఎందుకు పట్టించుకుంటడనని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు కావొస్తున్నా గెలిచిన ఎమ్మెల్యేకు నియోజకవర్గంలో ఎంత మంది రైతులు ఏయే బ్యాంకుల్లో ఎంత మేరకు రుణాలు తీసుకున్నారో తెలియదా? అని ప్రశ్నించారు. కాపులకనపర్తి సొసైటీలో 1907 మంది రైతుల్లో ఏ ఒక్కరికీ రుణమాఫీ కాలేదన్నారు. అదే సొసైటీలో పేరాల సాంబయ్య అనే రైతు రూ. లక్ష చెల్లిస్తే రసీదు ఇచ్చారు కానీ బ్యాంకులో జమచేయలేదని, అందుకు కారకులైన చైర్మన్, సీఈవో, ఉద్యోగులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి,నాయకులు దొనికెల శ్రీనివాస్, సంగెం సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, కాపులకనపర్తి సొసైటీ వైస్ చైర్మన్ ముడిదె శ్రీనివాస్, సుతారి బాలకృష్ణ,సోల్తి భూమాత, నర్సింహస్వామి, గోవర్ధన్‌గౌడ్, కత్తెరపెల్లి దామోదర్, ఉండీల రాజు, దోపతి సమ్మయ్య, పెంతల అనిల్, వీరాచారితో పాటు పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# రుణమాఫీపై ఏదీ చిత్తశుద్ధి?

**ఆత్మకూరులో ధర్నాలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**

ఆత్మకూరు, ఆగస్టు 24 : రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, సగం మందికి కూడా రుణమాఫీ చేయకుండా మోసం చేసిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శనివారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలకేంద్రంలో రైతు ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మాత్రం అమలు చేయడం లేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసేదాకా రైతుల పక్షాన బీఆర్‌ఎస్ రణం కొనసాగుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పోలీసులు ఇష్టానుసారంగా బీఆర్‌ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే సహించేది లేదన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో క్రైమ్ రేటు తగ్గిందన్నారు. అధికార పార్టీ నాయకుల మాటలు విని అక్రమంగా కేసులు పెట్టొద్దని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. తప్పు చేసిన వారిని వదిలిపెట్టొద్దన్నారు.



హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలకేంద్రంలో రుణమాఫీ కాని రైతులతో కలిసి ధర్నాలో పాల్గొన్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

# రైతు భరోసా రాదు.. రుణమాఫీ కాదు..

- గుండ్రాతి మడుగులో 35.88 శాతం మందికే మాఫీ
- మరో 243 మంది రైతుల ఎదురు చూపులు



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం

మహబూబాబాద్, ఆగస్టు 24 (నమస్తే తెలంగాణ) : ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్న చందంగా మారింది రైతుల పరిస్థితి. ఒకవైపు రైతు భరోసా రాక పెట్టుబడికి ఇబ్బందులు పడుతుండగా.. మరోవైపు పంట రుణం మాఫీ కాక ఆందోళనకు గురవుతున్నారు. అధికారుల తప్పిదానికి అనేక మంది రైతులకు మాఫీ వర్తించక కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండలంలోని గుండ్రాతి మడుగు (విలేజ్) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో ఈ గ్రామానికి చెందిన 379 మంది రైతులు సభ్యులుగా ఉండి రుణాలు పొందారు. వీరంతా రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు లోబడే ఉన్నారు. అయితే ప్రభుత్వం మూడు విడతల్లో చేపట్టిన రుణమాఫీ కేవలం 35.88 శాతం.. అంటే కేవలం 136 మందికే జరిగింది. మిగిలిన 243 మంది తమకు మాఫీ ఎప్పుడైతదోనని ఎదురు చూస్తున్నారు. వీరిలో చాలా మంది రైతులు తమ రుణాలను రెన్యువల్ చేసుకున్నప్పటికీ అధికారులు అప్‌డేట్ చేయకపోవడంతో మాఫీ వర్తించలేదు. మరికొంత మంది పేర్లు తప్పుగా నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. అయితే సంఘంలోని అధికారులు, సిబ్బంది చేసిన తప్పులను సవరించి తమకు రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## రూ. 37 వేలు మాఫీ కాలేదు..



మా ఊర్లో నా పేరు మీద రెండున్నర ఎకరాల భూమి ఉంది. ఆరేళ్ల క్రితం తీసుకున్న పంట రుణానికి మిత్తి కడుతూ రెన్యువల్ చేసుకుంటున్నా. గతేడాది కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కూడా నాకు రూ. 60 వేలు ఒకేసారి మాఫీ అయ్యింది. ప్రస్తుతం నాకున్న రూ. 37,600 రుణం మాఫీ కాలేదు. ఎందుకు కాలేదని సొసైటీ సార్లను అడిగితే పేరు తప్పుందని చెబుతున్నారు. ఇన్నేళ్లు లేని తప్పు ఇప్పుడెట్లా నమోదైంది. అధికారులే సమాధానం చెప్పాలి. నాకు అధికారులు, ప్రజాప్రతినిధులు న్యాయం చేయాలి.

–వేల్పుల ఉపేందర్, రైతు, గుండ్రాతి మడుగు (విలేజ్)

## మిరపకు చీర చుట్టు.. భూమికి రంగేసినట్టు!



మిరప గింజలు పెడుతున్న రైతులు

సాగు పనుల్లో రైతులు బిజీ అయ్యారు. ఇందులో భాగంగా బెడ్లు ఏర్పాటుచేసి వాటిలో మిరప గింజలను పెడుతూ వాటికి రక్షణగా చీరెలనుమహిళా రైతులు, కూలీలు కప్పుతున్న తీరు ఆకట్టుకుంటున్నది. నేలను పరుచుకున్న తీరొక్క రంగుల చీరలతో భూమికి రంగులేసినట్టున్న ఈ దృశ్యం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం సూరారం గ్రామ శివారులో 'నమస్తే' కెమెరాకు చిక్కింది.

- ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 24



మిరప గింజలు పెట్టిన బెడ్లపై చీరెలు కప్పుతున్న రైతులు